క్లుప్తంగా

వెంపటి పాఠశాలకు ఉత్తమ గుర్తింపు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం తీసుకుంటున్న హెచ్‌ఎం వెంకటరామనర్సమ్మ

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాల మండల ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. బుధవారం సూర్యాపేటలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా వెంపటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్తలూరి వెంకట రామనర్సమ్మ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచడం, నాణ్యమైన విద్యను అందించడం, మంచి ఫలితాలు సాధించడంతో వెంపటి ప్రాథమిక పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, మండల విద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాలకుర్తి ఎల్లయ్య, మల్లెపాక రవీందర్, గుండ్ల ఆంజనేయులు, గట్టు మాధవి, నిమ్మన బోయిన నవీన, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రమ్, మాలోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



వినతిపత్రం అందిస్తున్న మహిళలు

ఆత్మకూర్(ఎస్) : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, ఏవీ ఫౌండేషన్ సభ్యులు కోరారు. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడికి పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్య వివాహాలను అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొరివి శోభ, బొడ్డు రమణ, వెంకటమ్మ, వీరన్న, సైదులు, మహేష్, వత్సవాయి లలిత, సైదులు, జయలలిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మండల పరిధిలోని బాలెంలలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదివేందుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో బీఏ (హెచ్‌ఈపీ), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం జనరల్, ఎంపీసీ, ఎంఎస్‌డీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థినులు తమ వెంట ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ మెమో, టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 5 పాస్ ఫొటోలను తీసుకురావాలని, పూర్తి వివరాల కోసం 7995010681, 9398316225 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తికి గాయాలు

చివ్వెంల(సూర్యాపేట): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మునగాల మండల నర్సింహులగూడెం గ్రామానికి చెందిన నాగు దినేష్‌కుమార్ బైక్‌పై సూర్యాపేటకు వస్తుండగా.. మార్గమధ్యలో చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామ శివారులో ఖమ్మం నుంచి సూర్యాపేట వైపు వస్తున్న కారు వెనుక నుంచి అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దినేష్‌కుమార్ కాళ్లు, చేతులు, ముక్కు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న నర్సింహులగూడెం గ్రామానికే చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ సైదాఖాన్ గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, క్షతగాత్రుడిని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

పీహెచ్‌సీలో విచారణ



పీహెచ్‌సీలో విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోటిరత్నం

పెన్‌పహాడ్ : మండలంలో వైద్యాధికారి, ఏఎన్‌ఎంల నుంచి ఫిర్యాదులు అందడంతో కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోటిరత్నం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. మండల వైద్యాధికారి, ఏఎన్‌ఎంల నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. విచారణలో సేకరించిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్రవంతి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పండుగలా పాఠశాలల ప్రారంభం



సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



అర్వపల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మామిడి తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

- ప్రభుత్వ పాఠశాలలను తోరణాలతో అలంకరించిన ఉపాధ్యాయులు
- పూలు చల్లుతూ, పుష్పగుచ్ఛాలు అందజేస్తూ విద్యార్థులకు స్వాగతం
- మొదటిరోజునే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్ పంపిణీ



పెన్‌పహాడ్ : అనాజిపురం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం మండలవ్యాప్తంగా ఉపాధ్యాయులు, పిల్లలు సంబరాలు జరుపుకున్నారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు మామిడి తోరణాలు కట్టి పిల్లలకు స్వాగతం పలికారు. అలాగే పర్సాయపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్, పీఎస్, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో తొలిరోజు సంబరాలు జరిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరి : వేసవి సెలవుల తరువాత పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లో పాఠశాలల గదులను మామిడి తోరణాలతో అలంకరించారు. తిరుమలగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు పూలు చల్లుతూ ఆహ్వానించారు. తాటిపాముల, తొండ గ్రామాలలో తహసీల్దార్ హరిప్రసాద్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, హెచ్‌ఎం మాశెట్టి శ్రీనివాస్, సునీల్ కుమార్, కసిరెడ్డి అశోక్‌రెడ్డి, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆహ్వానం

తుంగతుర్తి: 2025–2026 విద్యాసంవత్సరానికి సంబంధించి గురువారం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి బోయిని లింగయ్య విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్తలూరి వెంకట్రామనరసమ్మ, పాలకుర్తి ఎల్లయ్య, రవీందర్, ఆంజనేయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. ఆయా పాఠశాలల్లో మామిడి తోరణాలు, రంగురంగుల కాగితాలు కట్టి ఉపాధ్యాయులు పిల్లలను పాఠశాలలకు ఆహ్వానించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ రాములు నాయక్ అన్నారు. గురువారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మండల కేంద్రంలోని పలు పాఠశాలలను సందర్శించి మాట్లాడారు.



తిరుమలగిరిలో విద్యార్థులకు పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో బడిబాట ర్యాలీ..

తుంగతుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల ఆధ్వర్యంలో గురువారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, అంబేడ్కర్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ప్రిన్సిపల్ కోడి లింగయ్య అన్నారు. గురువారం అనాజిపురం గ్రామంలోని పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. పాఠశాలల పునః ప్రారంభం రోజు కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మండలంలోని లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జమాల్ షరీఫ్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అన్నామేరి, ఉపాధ్యాయులు గుగ్రాల సోమయ్య, ఉపాధ్యాయులు ఖాసీం, రవిబాబు, శివశంకర్, సైదా, మంజూర్, మాధురి పాల్గొన్నారు.



ఆత్మకూర్ పాఠశాలలో బ్యాగులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



నూతనకల్ : పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రాములు నాయక్

సేంద్రియ సాగుపై అవగాహన కరువు

- రసాయన ఎరువుల వైపు మొగ్గుచూపుతున్న రైతులు



పొలంలోకి తరలిస్తున్న ఎరువు(ఫైల్)

నూతనకల్ : సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన లేకపోవడం, అధికారులు సరైన ప్రచారం చేయకపోవడంతో గ్రామాల్లో రసాయన ఎరువుల వినియోగం అధికమవుతోంది. దీంతో ఏటా పెట్టుబడులు పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. సేంద్రియ వ్యవసాయంపై గ్రామాల్లో రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం భిన్నంగా ఉంది. పంటలకు సోకిన రోగాలకు ఏ దశలో ఏ మందులు వాడాలో తెలియక, ఎరువుల వ్యాపారులు ఇచ్చే చవకబారు, నాణ్యత లేని నకిలీ మందులు వాడుతూ రైతులు నష్టపోతున్నారు. మండల వ్యాప్తంగా రైతులు ఖరీఫ్ సీజన్‌లో 24,500ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రకాలకు చెందిన సుమారు 5,600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంపై మండల వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా సేంద్రియ సాగుపై అవగాహన కల్పించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

నష్టాల బారిన పడుతున్నాం



సేంద్రియ సాగుపై అవగాహన లేకపోవడంతో రసాయన ఎరువులు వాడి నష్టపోతున్నాం. ఏ పంటకు ఏ ఎరువులు వాడాలో తెలియడం లేదు. రసాయన ఎరువులను అధికంగా పిచికారీ చేస్తున్నాం. దీని వల్ల పెట్టుబడులు పెరిగి నష్టాల బారిన పడుతున్నాం.

– మున్నా అశోక్, రైతు, చిల్పకుంట్ల

అవగాహన కల్పిస్తున్నాం



సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అందుబాటులో ఉండే పశువులు, గొర్రెల పేడను పొలాల్లో వేసుకోవాలి. జీవ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలి. గతంలో వర్మి కంపోస్టు బెడ్లు, వానపాములు వచ్చేవి. కానీ ప్రస్తుతం రావడం లేదు.

– మురళీబాబు, మండల వ్యవసాయ అధికారి

శిథిలావస్థ ఇళ్లలో నివాసం ప్రమాదకరం

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



డ్రెయినేజీలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సూర్యాపేట అర్బన్ : వర్షాకాలం దృష్ట్యా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ప్రమాదకరమని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని 11వ వార్డు రాయినిగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఇళ్లలోని తడి, పొడి, హానికమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని తెలిపారు. అనంతరం వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సరఫరా చేసే నీటికి క్లోరినేషన్ పరీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ కిరణ్, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, యాదగిరి, టీఎంసీ శ్వేత, వార్డు అధికారి నరేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా విభాగంపై తప్పుడు ఆరోపణలు తగవు

సూర్యాపేట అర్బన్ : మెప్మా విభాగంపై కొందరు మహిళలు కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలపై విచారణ కమిటీ, సోషల్ ఆడిట్ అధికారులు విచారణ చేసి నిజానిజాలు వెలుగులోకి తెచ్చారని తెలిపారు. గతంలో మున్సిపల్ ఆర్పీలుగా పనిచేసిన సిరి చందన రూ.15,84,584లను బ్యాంకులో జమ చేయకుండా తన సొంత ఖర్చులకు వాడుకున్నట్లు తేలిందని తెలియజేశారు. అదేవిధంగా ఆర్పీగా పని చేసిన మంజుల ఎస్‌ఎల్‌ఎఫ్ డబ్బులను సొంత ఖర్చులకు వాడుకున్నట్లు రుజువైందని పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యానగర్‌కు చెందిన రమ, మీల లక్ష్మి, తన్నీరు స్వరూప సంఘాల నుంచి వసూలు చేసిన శ్రీనిధి డబ్బులను బ్యాంకులో జమ చేయకుండా సొంత ఖర్చులకు వాడుకున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ డబ్బులను తిరిగి చెల్లించమని మిగిలిన సభ్యులు వారిపై ఒత్తిడి చేయగా, వారు మెప్మా సీఈఓ ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తున్నారని, తమ తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం మెప్మా విభాగంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు.

రైతుల చెంతకు అధికారులు

- అదనపు కలెక్టర్ రాంబాబు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : భూ సమస్యలు పరిష్కరించేందుకు రైతుల వద్దకే అధికారులు వస్తారని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణాన్ని సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు అందించే పోషకాహారంలో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్‌ఐ శ్రీధర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం



మద్దిరాల : మాట్లాడుతున్న భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చౌహాన్

నూతనకల్ : రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే వికసిత్ కృషి సంకల్ప అభియాన్ లక్ష్యమని జిల్లా ఉద్యాన అధికారి ఎన్.నాగయ్య అన్నారు. గురువారం తాళ్లసింగారం రైతు వేదికలో కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ మాట్లాడారు. పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతతో కూడిన వ్యవసాయ ప్రోత్సాహక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సుగంధి, మండల వ్యవసాయ అధికారి మురళి, ఇస్కో మార్కెటింగ్ అధికారి శరత్, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, ఏఈఓలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం

మద్దిరాల : రైతులు సేంద్రియ ఎరువులను వాడడం వల్ల భూసారం పెరుగుతుందని భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చౌహాన్, కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎం.కిరణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విత్తనాలు విత్తేముందు వాటి శుద్ధి, కలుపు యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి అనిషారూహి, ఏఈఓలు అనూష, మనోహర్, రైతులు భాస్కర్‌రెడ్డి, జయప్రకాష్, నవీన్, ఐలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



నెమ్మికల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూర్(ఎస్) : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న గ్రామ గ్రామాన జెండా ఎగురవేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. గురువారం ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న, గంట భిక్షపతి, తిప్పర్తి గంగరాజు, బొల్లెపాక మహేష్, మధు, కార్తీక్, వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



పెన్‌పహాడ్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ



అర్వపల్లి : దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి : భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. తొండ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, ఆర్‌ఐ సుచిత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు అనిత, అశోక్, సుభద్ర, చందు, వినోద్, అజయ్, రవికాంత్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : భూభారతి చట్టం వల్ల రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దూపహాడ్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులు తమ భూసమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత కల్గిన ప్రతి రైతు సమస్యను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 11 రెవెన్యూ సదస్సుల ద్వారా 1220 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరలోనే ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం దూపహాడ్ గ్రామంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఆర్‌ఐలు రంజిత్‌రెడ్డి, అజీజాబేగం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : కోడూరు, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో అధికారులు గురువారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతుల నుంచి 215 దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులన్నింటిని పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ సీహెచ్.యాదగిరి, గిర్దావర్లు జలేందర్‌రావు, పాటి వెంకట్‌రెడ్డి, ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ హరికిశోర్ శర్మ అన్నారు. గురువారం నాగారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. రైతుల నుంచి 151 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్‌ఐ అల్లావుద్దీన్, ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, సీనియర్ అసిస్టెంట్ షఫీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం



ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న అధికారులు

నాగారం : పదవ తరగతి ఫలితాల్లో 545 మార్కులు సాధించి నాగారం మండల టాపర్‌గా నిలిచిన ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పి.పూజకు గురువారం పాఠశాలకు చెందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి రూ.10,000 నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. అనంతరం జిల్లా సెక్టోరియల్ అధికారి రాంబాబు, ఎంఈఓ వాసం ప్రభాకర్‌లతో కలిసి విద్యార్థిని పూజను అభినందించి రూ.10,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మక్సూద్, పాష, రమేష్, మల్లయ్య, భాస్కర్, శ్రీనివాసచారి, రాజేశ్వరి, యాకయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారి రాంబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశారు.

టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

సూర్యాపేట : హుజూర్‌నగర్ పట్టణంలోని వర్తక సంఘం భవనంలో ఈ నెల 11న జరిగిన ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా ప్రథమ మహాసభలలో జిల్లా అధ్యక్షుడిగా గొడ్డలి నర్సయ్య, కార్యదర్శిగా సయ్యద్ హుస్సేన్‌తో పాటు 13 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొడ్డలి నర్సయ్య, సయ్యద్ హుస్సేన్‌లు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన జంపాల శైలజకు వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే మందుల సామేల్, డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డిల సహకారంతో రూ.60వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరైంది. ఆ చెక్కును గురువారం స్థానిక నాయకులు శైలజకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పిట్టల సైదులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

బీజేపీ కోశాధికారిగా లింగయ్య

నాగారం : బీజేపీ మండల కోశాధికారిగా నాగారం బంగ్లా గ్రామానికి చెందిన నీలం లింగయ్య గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా లింగయ్యను బీజేపీ మండల అధ్యక్షుడు కుంభం కర్ణాకర్, బీజేపీ జిల్లా నాయకుడు మొల్కపురి చిరంజీవి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాషబోయిన యాదగిరి, నర్సింగ వెంకన్న, ఎల్లాచారి, చింటూ, నోముల యాకోబు, బొబ్బలి కిరణ్, వంగూరి మహేష్, భార్గవ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా మార్చాలి

తిరుమలగిరి : నిరక్షరాస్యత కలిగి ఉన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చాలని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో వీఓఏల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం మధు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

తాటిచెట్లు నరికిన వారిపై చర్య తీసుకోవాలి

నాగారం : వర్ధమానుకోట రెవెన్యూ పరిధిలోని నాగారంబంగ్లా వద్ద తాటి చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల నాగయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని నాగారం బంగ్లా వద్ద నరికిన తాటిచెట్లను పరిశీలించి మాట్లాడారు. ఈ విషయంపై వర్ధమానుకోట గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తుంగతుర్తి ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేయగా వారు బుధవారం వచ్చి విచారణ జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, వీరయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.